

# తోడొకరుండిన...

## దువ్వూరి రాజిరెడ్డి

''ఆధునిక మానవుడు మనసున్న మనిషి కాడు. మేధావి మాత్రమే. ఆనాటి మానవుడు ప్రధానంగా సంస్కృతీ సంపన్నుడు కావడం చేత జీవితసారాన్ని తన అనుభవంలోకి తెచ్చుకోగలిగాడు. ఈనాటి మానవుడికి ఆ అవకాశం లేదు. వ్యక్తిగత జీవితం, వ్యక్తిగత అభిరుచులు అంతరించి మనిషి సామూహిక జీవిగానే మిగిలాడు. దీంతో మనిషిలో అస్థిరత, అసహనం పెరిగి జీవితం నిస్సారంగా తోచసాగింది. తెల్లారి లేస్తే మన దైనందిన జీవితంలోని ప్రతి చర్యను సైన్స్ నియంత్రించి జీవనవేగాన్ని విపరీతంగా పెంచింది. దీంతో మనిషి ఉక్కిరిబిక్కిరై యంత్రంలా బ్రతికేస్తున్నాడు. యంత్రాలకు సజీవ స్పందన ఉంటుందా? ఉండదు. అందుకేనేటి మానవుడు సాంస్కృతికంగా దిగజారి జీవచ్ఛవంలా బ్రతుకుతున్నాడు. ఆలోచన, అనుభూతి చంపేసుకుని మూఢునిలా బ్రతికే మానవుడు అణుబాంబు కంటే ప్రమాదకరమైనవాడు...''

''అబ్బబ్బబ్బా... ఆ రేడియో కట్టెయ్యి నాన్నా''

ప్రకాష్ అరుపుతో రేడియోలో వింటున్న ప్రసంగం వాల్యూమ్ తగ్గించాడు పరంధామయ్య. హాల్లో కొడుకు ప్రకాష్, కోడలు శారద, పిల్లలు అందరూ టీవీ ముందు కూర్చుని చూస్తూ ఉన్నారు.

టీవీ వాళ్ళ ముందు నిలబడి మాట్లాడుతూంది.

ట్రాన్సిస్టర్ తీసుకుని వరండాలోకి నడిచాడు.

''అలా బయటకెళ్ళి రాకూడదా నాన్నా''

ఇంట్లో ఉండి వాళ్ళని డిస్టర్బ్ చెయ్యొద్దని ప్రకాష్ సూచించాడు.

''ఊ... ఒక్కడ్నే ఎక్కడికెళ్ళను? తోడెవరన్నా ఉంటే బాగుండు''

''అలా బారేజి వరకు వెళ్ళి రావచ్చుగా. దానిక్కూడా తోడు కావాలా?'' ప్రకాష్ గొంతులో అసహనం.

ట్రాన్సిస్టర్ ఆఫ్ చేసి తలగడ కింద పెట్టాడు.

''రవీ... అలా వెళ్దాం వస్తావా'' మనవడ్ని పిలిచాడు.

''వాడు హోమ్‌వర్క్ చెయ్యాలి మీరు వెళ్ళి రండి''

కోడలి గొంతు హైకోర్టు చీఫ్ జస్టిస్ జడ్జిమెంట్‌లా స్థిరంగా పలికింది.

లేచిన రవి మెల్లగా కూర్చున్నాడు వాళ్ళమ్మవైపు చూస్తూ.

లాభం లేదనుకుని చెప్పులేసుకుని మెట్లు దిగాడు పరంధామయ్య.

''అన్నింటికీ తోడు కావాలంటారు''

''అలా అనుకునే ఇద్దరితో సరిపెట్టుకోక నాతోపాటు ఇంకో అయిదుగుర్ని కని, ఇదుగో ఇలా మా మానాన మమ్మల్ని బతకమని వదిలేశాడు మహానుభావుడు''

కోడలి రిమార్క్‌కి కొడుకు సమాధానం స్పష్టంగా వినపడింది పరంధామయ్యకి. నడవడం ప్రారంభించాడు.

అడుగులు మెల్లగా పడుతున్నాయి.

రోజూ నడిచే దారే.

బారేజి వైపు నడవసాగాడు, ఒంటరిగా.

శరీరం ముందుకు, మనసు తన గతంలోకి కదిలాయి.

★ ★ ★

''ఏంటండీ ఒక్కరే కూర్చుని ఆలోచిస్తున్నారు'' అర్ధాంగి శాంత పిలుపుతో ఈ లోకంలోకి వచ్చాడు పరంధామయ్య.

''ఆలోచనలకూడా తోడవసరం అంటావా?''

''అదిగో మళ్ళీ ఎగతాళి చేస్తున్నారు''

''లేదు శాంతా సరదా కన్నాను. నువ్వీ మధ్య ప్రతిదానికి తోడు అవసరం అంటున్నావు కదా. అందుకని''

''ఆ ఎత్తిపొడుపు మాటలే వద్దంటున్నాను... మనకి ఇద్దరేగా పిల్లలు, ఒకబ్బాయి, ఒకమ్మాయి. వాళ్ళకి చెరో తోడు కోసం ఇంకో ఇద్దర్ని కందామండీ అన్నాను. తప్పా?''

''మన పిల్లలు ఇద్దరూ ఒకరికొకరు తోడు. అది సరిపోదా''

''అలా కాదండీ బాబుకి ఒక తమ్ముడు, పాపకి ఓ చెల్లీ...''

''సరే, సరే''

అలా కోరుకున్న శాంతకి తర్వాత వరుసగా ముగ్గురు మగపిల్లలు పుట్టడంతో, ఆడపిల్లకి తోడు కావాలంటూ ఇంకో కాన్పు చూడటం, ఆ కాన్పు ఆడపిల్ల కావడం, అక్కడితో తను వేసక్టమీ చెయ్యించుకోవడం, వెరసి తన సంతానం సంఖ్య అరడజనుకు చేరుకుంది. తన బడిపంతులుద్యోగం తన కుటుంబాన్ని పోషించడానికి తననేం ఇబ్బంది పెట్టలేదు. శాంత పొదుపుగా సంసారం లాక్కురావడం వల్ల తను అప్పుల పాలవలేదు. పిల్లలందర్నీ చదివించి, వాళ్ళందరికీ తలా ఓ తోడు వెదికి, అందరూ సెటిలయ్యాక శాంత వెళ్ళిపోయింది శాశ్వతంగా, నాకు దూరంగా, నన్ను వదిలేసి ఒంటరిగా.

★ ★ ★

''ఏయ్ ముసలాడా ఇంట్లో చెప్పొచ్చావా?''

ఎదురుగా సడన్‌బ్రేక్‌తో కీచుమంటూ ఆగిన జీప్‌లోంచి వచ్చిన కేకతో ఈ లోకంలోకి వచ్చాడు పరంధామయ్య.

''నీతోబాటు నన్ను కూడా పైకి తీసుకెళ్దామనా?... నీయమ్మ...'' తిడుతున్న బూతులు వినబడటం లేదు. అతనన్న మాట.

''నీతోబాటు నన్ను కూడా...'' మాత్రం పదేపదే వినపడుతూంది.

బతికినన్ని రోజులు తనకొక మంచి తోడు కావాలని కోరుకునే తనికి అతని మాటలోని చావుక్కూడా తోడు అన్న విషయం మళ్ళీ గతంలోకి తీసుకెళ్ళింది.

★ ★ ★

''ఏమండీ, పిల్లల్ని ఒక్కసారి... నేను పోయే లోపల... ఒక్కసారి చూడాలనుందండీ'' శాంత మంచం మీద ఆయాసంతో ఎగిరెగిరి పడుతూ అడిగింది.

''అందర్నీ రమ్మని టెలిగ్రాంలు ఇచ్చానే, నువ్వు ఎక్కువగా మాట్లాడకుండా రెస్ట్ తీసుకో''

''ఏమండీ 'అమ్మకు సీరియస్‌గా ఉంది రండీ' అంటే వాళ్ళు రారండీ... 'అమ్మ చచ్చిపోయిందీ... మీరందరూ...''

''వద్దు శాంతా... అలా మాట్లాడకు'' శాంత నోటిమీద తన అరచెయ్యుంచాడు పరంధామయ్య.

''ఏమండీ నన్ను మాట్లాడనీయండి, మనం తోడు, తోడు అంటూ పిల్లల్ని కని, వాళ్ళ కోసం ఎన్నో సుఖాలు వదులుకొని వాళ్ళని పెంచి పెద్దచేశాం... కదండీ'' ఆయాసంతో శాంత ఆగింది.

''శాంతా ప్లీజ్''

''నా బాధ చెప్పుకోనివ్వండి, నన్నాపొద్దు... మన పిల్లలండీ... సంవత్సరానికొక సారయినా ఒకర్నొకరు కలుసుకోరండీ... ఇందుకా మనం ఇన్ని బాధలు పడింది...''

''శాంతా... వాళ్ళు... వాళ్ళ జీవితాలతో ఎంత బిజీగా ఉంటున్నారో చూస్తున్నాం కదా, వాళ్ళకి మాత్రం కలుసుకోవాలని ఉండదంటావా?''

''ఏమండీ ప్లీజ్... మీరు మాట్లాడకండి... నన్ను చెప్పనివ్వండి. తీరిక లేకపోవడమేంటండీ. పెద్దాడు మొన్న వేసవి సెలవలకి ఊటీ వెళ్ళలేదా... చిన్నాడు ఏదో ట్రైనింగ్ ఉందంటూ పెళ్ళాం బిడ్డల్ని తీసుకుని సింగపూర్ వెళ్ళలేదా... చిన్నమ్మాయి, అల్లుడూ కలిసి పోయిన సంక్రాంతి పండక్కి ఎక్కడో ఉంటున్న... అదేంటండీ... అదేదో ఊరు... సరిగా గుర్తురావడం లేదు...''

''శాంతా...''

''మన దగ్గరకు రావడానికి మాత్రం వాళ్ళకి తీరిక దొరకదు. అంతే లెండి. అడ్డాలనాడు బిడ్డలుగానీ... నేను మాత్రం అదృష్టవంతురాలినండీ... హాయిగా మీ చేతుల్లో వెళ్ళిపోతున్నాను... ఏవండీ... ఏ... మం... డీ''

''శాంతా నువ్విక మాట్లాడితే నామీదొట్టే'' అర్థించాడు పరంధామయ్య అనాలోచితంగా అన్నా, భగవంతుడు 'తథాస్తు' అన్నాడు.

శాంత గొంతు శాశ్వతంగా మూగబోయింది.

కళ్ళు నెమ్మదిగా మూతబడ్డాయి.

''నాతోడు నన్నొదిలి వెళ్ళిపోయింది ఒంటరిగా'' ఇలా ఎన్నిసార్లనుకున్నాడో.

★ ★ ★

''ఏంటి బాబూ మీక్కూడా కళ్ళు కనపడవా?''

దారినబోయే ఓ కళ్ళులేనివాడ్ని డాష్ ఇచ్చింతర్వాత కాని పరంధామయ్య ఈ లోకంలోకి రాలేదు.

'అప్పుడే బారేజి దగ్గరికి వచ్చేశానే' అనుకున్నాడు.

అలవాటుపడిన కాళ్ళు తన ప్రమేయం లేకుండానే తనని బారేజి చేర్చాయి. బారేజి మీదున్న ఫుట్‌పాత్ మీదకి చేరాడు పరంధామయ్య.

మెల్లగా నాలుగడుగులు వేశాడు.

రోజూ చూసే ముఖాలే చాలా.

సిగరెట్లు తాగుతూ కొందరు, వేరుశనక్కాయలు తింటూ కొందరు కష్టం, సుఖం చెప్పుకుంటున్నారు. అలా చూస్తూ చివరి వరకూ వెళ్ళి వద్దామని కదిలాడు. ఎక్కడైనా తనలా ఒంటరిగా కూర్చున్నవాడు కనపడతాడేమోనని చూశాడు.

దూరంగా ఒక్కడే కూర్చుని, వచ్చేపోయే వాళ్ళని చూస్తున్నాడొక మనిషి. వడివడిగా అడుగులు వేస్తూ అతన్ని సమీపించాడు.

''బాబూ... ధర్మం చెయ్యండి బాబూ... అవిటివాడ్ని, కదలలేను బాబూ, ధర్మం చెయ్యండి బాబూ...'' దారినపోయే వాళ్ళ దగ్గర్నుండి పావలా, అర్ధా అడుక్కుంటున్నాడు ఒంటరిగా.

వెనక్కి తిరిగాడు పరంధామయ్య.

కొంత దూరం నడిచి, కూర్చున్నాడు.

ఎదురుగా కృష్ణానది అంతులేని ఆకాశంలా ఉంది.

ఒడ్డులేని సముద్రంలా ఉంది, ఒంటరిగా.

'ఛీ... ఛీ... కామెర్ల రోగి మనస్తత్వం లాగుంది నా పరిస్థితి. చివరికి నదిక్కూడా తోడు లేదనిపిస్తూంది' అనుకున్నాడు.

రోజూ కూర్చునే చోటే అయినా ఆ రోజెందుకో కూర్చోలేకపోయాడు.

లేచి నిలబడ్డాడు.

సాయంకాలం రాత్రిలోకి మారకముందే ఇంటివైపు కదిలాడు.

★ ★ ★

''అన్నీ టేబుల్ మీద పెట్టాను, వెళ్ళి భోంచెయ్యండి''

కోడలి పిలుపుతో గోడ గడియారం వైపు చూశాడు.

ఎనిమిది గంటలయ్యింది.

''అబ్బాయొచ్చాక తింటాలేమ్మా, వాడితో కలిసి భోంచేసి చాలారోజులయింది''

''ఆయన ఈ రోజు 'ఆఫీసులో పనుందీ లేట్‌గా వస్తాన్నారు' మీరెళ్ళి తినండి. అన్నం చల్లారిపోతే మళ్ళీ వెచ్చబెట్టాల్సొస్తుంది''

డైనింగ్ హాల్లోకి వెళ్ళాడు పరంధామయ్య.

అన్నీ గిన్నెల్లో సర్ది, మూతలు పెట్టున్నాయి.

కంచం ఒక్కటే మూత లేకుండా ఒంటరిగా తన కోసం ఎదురుచూస్తున్నట్టుంది.

టేబుల్ ముందు కూర్చున్నాడు.

అన్నం వడ్డించుకున్నాడు.

కూర వేసుకున్నాడు.

ఆ తరువాత ఏమీ వేసుకోలేదు.

వేసుకున్నాడో, వేసుకోలేదో అని చూసేవారులేరు.

భోజనం అయిందనిపించాడు ఒంటరిగా.

తర్వాతి కార్యక్రమం, తన కోసం కేటాయించిన స్టోర్‌రూమ్... అదే తన బెడ్‌రూమ్, దాన్లోకెళ్ళి పడుకోవడం.

రోజులాగే పడుకునే ముందు తలగడ కింద ఉండే ట్రాన్సిస్టర్ కోసం చెయ్యిపెట్టాడు. అదక్కడ లేదు.

''ఒరే రవీ, నా రేడియో తీసుకున్నావా?'' మనవడ్ని పిలిచాడు.

''తాతయ్యా, అన్నయ్య క్రికెట్ కామెంటరీ వింటున్నాడు, డే అండ్ నైట్ మ్యాచ్. తీసుకురానా'' అరిచాడు రవి.

''వద్దులే నాన్నా''

రవి తన గదిలోకి వచ్చాడు.

''తాతయ్యా, తాతయ్యా... నేను నీ దగ్గర పడుకోనా''

''నా బంగారు తండ్రి. పడుకో బాబూ''

''రవీ, ఎక్కడున్నావ్? వచ్చి పడుకో'' కోడలి గొంతు.

రవి తాతగారి వైపు చూశాడు.

''పోనీలే అమ్మా ఇవ్వాల్టికి నా దగ్గర పడుకుంటాడ్లే''

''వద్దులెండి... ఇవాళో, రేపో మీరు మీ చిన్నబ్బాయి దగ్గరకెళ్ళిపోతారు అప్పుడే తాతగారి దగ్గర పడుకుంటాడు? రవీ రారా''

త్వరలోనే మీ ప్రయాణం అని ఇండైరెక్ట్‌గా హింట్ ఇస్తూంది కోడలు.

రవి మెల్లగా హాల్లోకి నడిచాడు.

ఆ రాత్రి ఎప్పుడూ తన నంటిపెట్టుకొనుండే ట్రాన్సిస్టర్ కూడా లేదు.

పడుకున్నాడు.

ఒంటరిగా.

★ ★ ★

రాత్రంతా నిద్రపోడానికి ప్రయత్నిస్తూనే ఉన్నాడు.

నిద్రకూడా అతనికి దూరంగా పారిపోయింది.

ఇంట్లో అందరూ అందరూ నిద్రపోతున్నారు.

తనని కాపలా పెట్టి ఇల్లు కూడా నిద్రపోతూంది.

తను మాత్రం, చీకట్లోకి చూస్తూ పడుకున్నాడు, ఒంటరిగా.

తెల్లవారుతూంది.

పేపర్‌బోయ్ వేసిన పేపర్ రాకెట్‌లా వచ్చి కారిడార్‌లో పడింది.

పాలవాడి కేకతో, పడక మీద నుంచి లేచి తలుపుతీసి పాల పాకెట్స్ తీసుకుని వంటింట్లో పెట్టాడు పరంధామయ్య.

హాల్లోకి తొంగి చూశాడు.

ఎవ్వరూ ఇంకా నిద్రలేవలేదు.

కొడుకు ప్రకాష్ కనపడలేదు. బహుశా రాత్రి వచ్చి ఉండడు.

ముఖం కడుక్కొని చెప్పులేసుకున్నాడు.

డోర్‌బెల్ మోగింది.

తలుపు తీశాడు.

''నాన్నా మార్నింగ్ వాక్‌కి వెళుతున్నారా'' ప్రకాష్ పలకరించాడు.

''ఏంరా, ఇప్పుడేనా రావటం''

''రాత్రి మా కొలీగొకడు పార్టీ ఇచ్చాడు నాన్నా... లేటయింది''

''ఎంత పార్టీ అయితే మాత్రం, రాత్రంతా నిద్రపోకుండా... సరే, నే వెళ్ళొస్తా''

''నాన్నా ఈ రోజు మీరు వొంటరిగా వెళ్ళక్కర్లేదు''

''మరి, నువ్వొస్తావా?'' ఆశ్చర్యం, ఆనందం మీద సూపర్ ఇంపోజ్ అయి పరంధామయ్య నోటి నుండి వచ్చిందా మాట.

''మీకొక తోడు తీసుకొచ్చాను''

చేతిలోని సన్నని, పొడుగాటి పార్సిల్ విప్పాడు ప్రకాష్.

అది ఊతకర్ర.

''మా ఫ్రెండొకడు ఈ మధ్య సింగపూర్ కెళ్ళినపుడు తెచ్చాడట నాన్నా. మీకు పనికొస్తుందని తీసుకున్నాను''

'అవును, నాకు చాలా అవసరం' అనుకున్నాడు పరంధామయ్య.

తీసుకున్నాడు.

''థాంక్స్'' అన్నాడు.

''బై డాడీ'' ప్రకాష్ లోపలికెళ్ళి తలుపేసుకున్నాడు.

ఊతకర్ర చాలా అందంగా ఉంది.

సింగపూర్ ఊతకర్ర మరి.

ఆ కట్టెను చేత్తో పట్టుకున్నాడు, మృదువుగా నిమిరాడు, ప్రేమగా చూశాడు, హుందాగా నడవడం ప్రారంభించాడు.

'ఈ కట్టె తనకు ఆధారమై నడిపిస్తుంది'

'కాటిదాకా మోస్తుంది'

'నా ఈ కట్టెను కడతేరుస్తుంది'

ఈ కట్టెకున్న మనసు మనిషికి లేదా

ఆలోచిస్తూ నడుస్తున్నాడు పరంధామయ్య.

చాలారోజుల తరువాత,

హుషారుగా నడుస్తున్నాడు,

ఉల్లాసంగా నడుస్తున్నాడు,

హుందాగా నడుస్తున్నాడు,

'తోడు'గా నడుస్తున్నాడు.

★